## క్లుప్తంగా

### బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

నల్లగొండ టౌన్: మూడేళ్లుగా నిలిపివేసిన ముషంపల్లి – కన్నెకల్ – నిడమనూరు బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మాజీ సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కౌన్సిలర్‌ల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బోదనపు వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బస్సు సర్వీసును నిలిపివేయడం వల్ల ఆ రూట్‌లో ఉన్న వివిధ గ్రామాల ప్రజలు నల్లగొండ పట్టణంతోపాటు నిడమనూరు మండల కేంద్రానికి వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అన్ని రూట్లలో రద్దు చేసిన బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు.

### ఎమ్మెల్యే వీరేశానికి సన్మానం



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని ఆదివారం చిట్యాల మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బోడ స్వామి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మారగోని ఆంజనేయులు, బోడ శ్రీనివాస్, మేడి నరేష్, కుక్కల మోహన్, దాసరి వెంకన్న, గంగారపు గణేశ్, కోసనం అశోక్ పాల్గొన్నారు.

### జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలి

చండూరు : జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని అఖిల భారత పాపన్న గౌడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దగాని ముత్యాలు గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇదే విషయంపై ముఖ్యమంత్రికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. గత ప్రభుత్వానికి కూడా అనేక మార్లు వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దగోని రాఘవేంద్రగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### మల్లేష్‌కు పలువురి నివాళి



నివాళులర్పిస్తున్న పున్న కైలాస్ నేత

మునుగోడు: మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన శాలివాహన సంఘం రాష్ట్ర నాయకుడు బొడ్డుపల్లి మల్లేష్ శనివారం హైదరాబాద్‌లో ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం ఊకొండిలో జరిగిన అంత్యక్రియలకు పలువురు నేతలు హాజరై మల్లేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.మల్లేష్ జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత, మాజీ ఎంపీపీ పోలగోని సత్యంగౌడ్, సర్పంచ్ నడిపల్లి యాదగిరి, ఎంపీటీసీ పోలగోని విజయలక్ష్మిసైదులు, వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, దాడి శ్రీనివాస్‌రెడ్డి, భవనం శ్రీనివాస్‌రెడ్డి, పాల్వాయి చెన్నారెడ్డి, టేకుమట్ల శ్రీరాములు, కైలాస్ గౌడ్, తిరందాసు శ్రీనివాసులు, పోలగోని సైదులుగౌడ్, జంగిలి నాగరాజు, బీసం విజయ్ తదితరులు నివాళులర్పించారు

# 'బెల్టు' తీస్తున్న అధికారులు

- బెల్టు దుకాణాలు మూసివేయిస్తున్న ఎక్సైజ్, పోలీసు సిబ్బంది
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు



మునుగోడు : కొరటికల్ గ్రామంలోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్, సివిల్ పోలీసులు

మునుగోడు: నియోజకవర్గంలో బెల్టు దుకాణాల మూసివేతకు ఎక్సైజ్, పోలీసు అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు నాలుగైదు రోజులుగా గ్రామాల్లో తనిఖీలు చేస్తూ బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయించవద్దని సూచిస్తున్నారు. ఎవరైనా తమ ఆదేశాలను ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. మూడు రోజుల క్రితం మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామంలోని ఓ బెల్టు దుకాణంలో మద్యం పట్టుబడగా ఆ మద్యాన్ని మునుగోడు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అంతేకాకుండా బెల్టు దుకాణదారులకు మద్యం విక్రయించవద్దని నియోజకవర్గంలోని వైన్స్‌షాపుల యజమానులకు ఆదేశాలు జారీచేశారు. ఇరు శాఖల అధికారులు ప్రతిరోజు దాదాపు 15కు పైగా గ్రామాల్లో క్షుణంగా పరిశీలించి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. శనివారం మునుగోడు ఎస్ఐ వెంకటేశ్వర్లు, చండూరు ఎక్సైజ్ ఎస్ఐ అఖిల్ తన సిబ్బందితో కలిసి కొరటికల్, గూడపూర్, కల్వలపల్లి, పులిపలుపుల, జమస్థాన్‌పల్లి గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. గ్రామాల్లో బెల్టు దుకాణాల మూసివేతకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఇరుశాఖల అధికారులు కోరారు.

**ప్రతిరోజూ సమీక్షిస్తున్న ఎమ్మెల్యే..**

బెల్టు దుకాణాల మూసివేతపై స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రతిరోజు అధికారులతో సమీక్షిస్తున్నట్లు తెలిసింది. సంబంధిత ఎక్సైజ్ అధికారులతో పాటు సివిల్ పోలీసులకు ఫోన్‌చేసి బెల్టు దుకాణాల మూసివేతపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు అని అడిగి తెలుసుకుంటున్నట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో పూర్తిగా బెల్టు దుకాణాలు మూసివేయించాలని, ఏ ఒక్కరికీ మినహాయింపు ఇవ్వొద్దని సూచించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే సూచన ప్రకారం వంద శాతం బెల్టు దుకాణాల మూసివేతకు అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

**ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు..**

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు కొనసాగుతుండడంతో అనేక మంది ఇబ్బందులకు గురయ్యారు. పలువురు పేద కుటుంబాలకు చెందినవారు ప్రతిరోజు మద్యం తాగడంతో వారు చేసిన కూలీ డబ్బులు మద్యానికే సరిపోయేవి. దీంతో కుటుంబాల్లో తగవులు మొదలై కొందరు దాడులు చేసుకునేవారు. నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోపాటు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని బెల్టు దుకాణాలు మూసివేయించడం పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 90 శాతం వరకు బెల్టు దుకాణాలు మూసివేశారని, కొందరు దొంగచాటుగా నడిపిస్తున్నారని వాటిని త్వరలో మూసివేయిస్తామని అధికారులు చెబుతున్నారు.

## వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కట్టంగూర్ : వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



కనగల్ : కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కట్టంగూర్ : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రెడ్‌క్రాస్ యూత్ జిల్లా కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం కట్టంగూర్ మండలంలోని బొస్కర్లబాయి గ్రామంలో ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ డిజేబిలిటీస్ సీనియర్ సిటిజన్స్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, మొబైల్ మెడికేర్ యూనిట్(ఎంఎంయూ) ప్రాజెక్ట్ వారు సంయుక్తంగా వయోవృద్ధులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో రెండు నెలలుగా వివిధ గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలోని 58 మంది వృద్ధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎన్న నర్సిరెడ్డి, ఎన్న లక్ష్మారెడ్డి, ఎనమల్ల అంజయ్య పాల్గొన్నారు.

**ఉచిత కంటి వైద్యశిబిరం**

కనగల్ : మండల పరిధిలోని ఎం గౌరారం గ్రామంలో నల్లగొండ యూరోవిజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 200 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 50 మందికి కంటి ఆపరేషన్ చేయాలని గుర్తించినట్లు డాక్టర్లు తేజస్విరెడ్డి, సౌరమ్యరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల జానయ్య, పాలకూరి శంకర్, వైద్య సిబ్బంది తదితరులున్నారు.



నల్లగొండ: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కిరణ్

రామగిరి(నల్లగొండ): కైరో ప్రాక్టీస్ ద్వారా దీర్ఘకాలికంగా ఉన్న నొప్పులను దూరం చేసుకోవచ్చని లయన్స్ శక్తి న్యూ వాయిస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఝాన్సీరాణి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీ కళాశాలలో జీకేఆర్ కైరో ప్రాక్టిక్ ఫిజియోథెరపీ క్లినిక్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆపరేషన్ లేకుండా దీర్ఘకాలికంగా ఉన్న నడుము నొప్పి, సయాటికా మెడనొప్పి, భుజం నొప్పి, మోకాళ్ల నొప్పులను ఈ చికిత్స ద్వారా దూరం చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, డాక్టర్ కిరణ్, వాకర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పుల్లారావు కార్యదర్శి పసల శౌరయ్య, నిమ్మల భీమార్జున్‌రెడ్డి, ఆప్తమాలజిస్ట్, ప్యాట్రిక్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 20న మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్‌లు నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డబ్బికార్ మల్లేష్ బానాల పరిపూర్ణచారి, ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, కానుగు లింగస్వామి, మల్లు గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శిలాఫలకం ధ్వంసం

చిట్యాల: తాళ్లవెల్లెంల గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. చిట్యాల మండలంలోని తాళ్లవెల్లెంల గ్రామం నుంచి మునుగోడు మండలం ఊకొండి గ్రామానికి వెళ్లే రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు గత ఎన్నికల ముందు అప్పటి నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శంకుస్థాపన చేశారు. ఆ శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి ధ్వంసం చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ జనగాం నర్సింహగౌడ్ అధికారులను కోరారు.



ధ్వంసమైన శిలాఫలకం

## అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు



పాదయాత్ర చేస్తున్న నాయకులు

నల్లగొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు యనమల్ల అనిల్ అన్నారు. నల్లగొండ నుంచి భారీ మెజార్టీతో గెలుపొంది కోమటిరెడ్డి మంత్రి పదవి చేపట్టిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్, మాల మహానాడు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని డీఈఓ ఆఫీస్ సమీపంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి కనగల్ మండలం దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించిన 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కంచి మధుసూదన్, తల్లమల్ల యాదగిరి, చింతపల్లి లింగమయ్య, అవుట రవీందర్, మేకల రమేష్, బత్తుల సైదులు, గాలి నాగరాజు, బూర్గు సైదులు, తల్లమల్ల జనార్దన్, భూతం అర్జున్, రెడ్డిమళ్ల రవి, బూరుగు వెంకటయ్య, అనుమలపూరి నాగరాజు, అనుమలపూరి సైదులు, మేకల నగేష్, ఏశమల్ల శంకర్, బత్తుల అనిల్, తల్లమల్ల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్వాధీనం చేయాలి



మాట్లాడుతున్న హాషం

నల్లగొండ టౌన్: అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేసి, డ్రా ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే స్వాధీనం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ వర్గ సభ్యుడు సయ్యద్ హాషం, సీపీఎం పట్టణ కార్యదర్శి ఎండీ సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు అసంపూర్తిగా ఉన్నందున తగిన నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలన్నారు. ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలాన్ని ఇచ్చి, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నర్సింహ, దండెంపల్లి సరోజ, గాదె నర్సింహ, మైల యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, అరుణ, లింగమ్మ, మారగోని నగేష్, గంజి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



నకారా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని పెన్షనర్స్ సామాజిక సేవా భవనంలో జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పెన్షనర్స్ హక్కుల కోసం పోరాడిన యోధుడు నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నకారా కృషి ఫలితంగానే ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్లు వచ్చాయన్నారు. అనంతరం 70 సంవత్సరాలు నిండిన పెన్షనర్లను రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు సన్మానించారు. పెన్షనర్లకు క్రీడాపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జెల్లా శ్రీశైలం, అమృతారెడ్డి, బి. మోహన్‌రావు, ఆంజనేయులు, యుగేందర్, కృష్ణయ్య, సంతోష్‌రెడ్డి, యాదగిరి, ప్రచార కార్యదర్శి శంకర్‌రెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మండల పూజ



పూజలు నిర్వహిస్తున్న గురుస్వాములు



పాల్గొన్న భక్తులు, అయ్యప్ప మాలధారులు

రామగిరి (నల్లగొండ): రామగిరిలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మండల పూజా మహోత్సవాన్ని ఆదివారం అయ్యప్పమాలధారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి మహా రుద్రాభిషేకం, లక్ష బిల్వ దళార్చన, శత సహస్రనామార్చన అష్టాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప, హనుమాన్ మాలశిరులకు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధాన గురుస్వామి నోముల శ్యామ్, ఆలయ కమిటీ చైర్మన్ కొలనుపాక రవికుమార్, అశోక్, అర్చకుడు మహేష్ శర్మ, కౌన్సిలర్ యామ కవితా దయాకర్, ఎల్వీ శ్రీనివాస్, మిర్యాల యాదగిరి, శ్రీధర్, అల్లి వేణు, జగిని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటాం

నార్కట్‌పల్లి : ఆపదలో ఉన్నవారికి ఆర్థికంగా, సామాజికంగా సహాయ సహకారాలు అందించే లక్ష్యంతో స్వాన్ (స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ నార్కట్‌పల్లి ) సంస్థ ఏర్పాటు చేశామని వ్యవస్థాపకుడు మామిళ్ల సత్తిరెడ్డి తెలిపారు. నార్కట్‌పల్లి హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను చదువు చెప్పిన పాఠశాలలోని విద్యార్థులు ఎవరు కూడా ఇబ్బందులకు గురి కాకూడదనే ఉద్దేశంతో ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులందరూ స్వాన్‌లో చేరి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మెరుగు శ్రవణ్‌కుమార్, దామెర నవీన్, ఉదయ్, సంజీవ, జానయ్య, సత్తయ్య, వెంకట్‌రెడ్డి, అమరేందర్, నరసింహ, ప్రదీప్, స్వాతి, కవిత ఉన్నారు.




# యూత్ సెమీ క్రిస్మస్ వేడుకలు




పాటలు పాడుతున్న గాయకులు



పాల్గొన్న క్రైస్తవులు

రామగిరి(నల్లగొండ): క్లాక్ టవర్ సెంటర్‌లోని సెంటినరీ సెల్ఫ్ సపోర్టింగ్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో యూత్ సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పాస్టర్ పాల్ డేవిడ్ సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రీస్తు సందేశాన్ని అందజేశారు. యూత్ సభ్యులు క్రీస్తు జననంపై నృత్య ప్రదర్శనతోపాటు క్రిస్మస్ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ డి ప్రేమ్‌కుమార్, కార్యదర్శి టిఎస్. ఫ్రాన్సిస్, కోశాధికారి డి తబిత, ఉపాధ్యక్షుడు డి సందీప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డైమండ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### జోనల్ కబడ్డీ జట్లకు ఎంపిక



ఎం. త్రివేణి



హిమవర్షిణి

శాలిగౌరారం: మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్‌స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు కబడ్డీ జోనల్ జట్లకు ఎంపికయ్యారని మోడల్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు బొడ్డు మల్లేష్ ఆదివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హాలియాలో ఆదివారం కబడ్డీ జిల్లాస్థాయి క్రీడలు జరిగాయి. పాఠశాలకు చెందిన ఇంటర్ ఎంపీసీ విద్యార్థిని ఎం.త్రివేణి అండర్–17, 7వ తరగతి చదువుతున్న హిమవర్షిణి అండర్–14 నల్లగొండ డివిజన్ నుంచి ప్రతిభ కనబరిని జోనల్ జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

### ఆర్థికసాయం అందజేత

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని జనగాం గ్రామంలో నాతి వెంకటేశం మృతి చెందడంతో ఆయన మిత్రులు ఆదివారం రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆ కుటుంబంకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గజవెల్లి వెంకటేశ్వర్లు, తిరుమలేష్, మునీర్, జి. శ్రీనివాస్‌లు, కొండోజు వెంకటేశ్వర్లు, ఒర్సు వెంకటేష్, శేఖర్, రాములు, రాంబాబు, వెంకటేశం పాల్గొన్నారు.

మాడుగులపల్లి: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కొండేటి వెంకటయ్య పూరి గుడిసె ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమైంది. నిత్యావసరాలు, దుస్తులు, నగదు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి ఆదివారం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట తిరుమలగిరి సాగర్ వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, నెల్లికల్లు సర్పంచ్ జనార్దన్‌రెడి ఉన్నారు.

### ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకుడు బచ్చుపల్లి శ్రీనివాస్‌రావు (52) ఆదివారం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శ్రీనివాస్‌రావు నకిరేకల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. శ్రీనివాస్‌రావు మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### పాపయ్యకు నివాళి

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెంకు చెందిన ఎంఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు రుద్రవరం లింగస్వామి తండ్రి పాపయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. పాపయ్య మృతదేహాన్ని ఆదివారం పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. టీపీసీసీ మాజీ కార్యదర్శి దైద రవీందర్, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్, మండల కార్యదర్శి అక్బర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, ఎంఎస్ఎఫ్ జాతీయ మాజీ ప్రధానకార్యదర్శి చేకూరి గణేష్, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షుడు ఎడ్ల మహలింగం యాదవ్ తదితరులు వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు.

### నేడు ఓపెన్‌ఫోరం

శాలిగౌరారం: మండలంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద సంవత్సర కాలంలో చేపట్టిన పనులపై సోమవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోషల్ ఆడిట్ ఓపెన్‌ఫోరం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సుందరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉపాధిహామీ పథకం సిబ్బంది, కూలీలు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు విధిగా సామాజిక తనిఖీ కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

